# ‘ఆరోగ్య సురక్ష’.. పేదలకు భరోసా

- వైద్య శిబిరాలకు విశేష స్పందన
- లబ్ధిదారుల కృతజ్ఞతలు



భవానీ గార్డెన్స్ వైద్య శిబిరంలో కేస్ షీట్ అందిస్తున్న వైద్యాధికారి శాంతి




49వ వార్డులో ఓపీ నమోదు చేయించుకుంటున్న స్థానికులు

**కంచరపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని జీవీఎంసీ జోన్–5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ అన్నారు. 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని భవాని గార్డెన్స్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జరిగిన రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి పరిశీలించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శాంతి నేతృత్వంలో వైద్యాధికారులు రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 192 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సునీత, మణి, శివాజీ, శ్రీదేవి, రాజ్యలక్ష్మి, శరణ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గవర నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

**512 మందికి వైద్య సేవలు**

**మద్రిపాలెం:** జీవీఎంసీ 49వ వార్డు ఏఎస్సార్ నగర్–2లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు.

సాధారణ, చెవి, ముక్కు,గొంతు(ఈఎన్‌టీ), నేత్ర(ఆప్తమాలజీ), దంత (డెంటల్), చర్మవ్యాధి(డెర్మటాలజీ), ఎముకల(ఆర్థోపెడిక్) వంటి వైద్య నిపుణులు అందుబాటులో ఉండి సుమారు 512 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. 813 టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎముకలకు సంబంధించి ఒకరిని రిఫరల్ చేశారు. వైద్య శిబిరంలో యూపీహెచ్‌సీ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసీ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## వైద్య సేవలు బాగున్నాయి



గతంలో ఏ అనారోగ్య సమస్య వచ్చినా ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నేడు మా ప్రాంతంలోనే మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

– పి.భవానీ ప్రసాద్, ఐటీఐ జంక్షన్

# బీఎల్‌ఏలకు దిశానిర్దేశం



బీఎల్‌ఏలతో సమావేశం నిర్వహిస్తున్న కె.కె.రాజు

**సీతమ్మధార:** బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం జీవీఎంసీ 48, 53 వార్డులకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లతో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌ఏలకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ జాబితాపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఇంటింటికీ వెళ్లి ఓటర్లు ఉన్నారా లేదా అని పరిశీలించాలన్నారు. డబల్ ఎంట్రీలు లేకుండా చూడాలన్నారు. ఇంట్లో ఎంత మంది ఉంటున్నారు.. వారి వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ వార్డు ఇన్‌చార్జి సీలి రవి, బగాది విజయ్, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

# సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



మహిళలకు స్టీల్ క్యాన్లు అందజేస్తున్న సంపంగి శ్రీనివాసరావు

**సీతంపేట:** కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం, ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని సింహాచలం దేవస్థానం బోర్డు మెంబర్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి సంపంగి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట రెల్లివీధిలో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. నవరత్నాలు పథకాల అమలుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారని చెప్పారు. మెరుగైన వైద్యం, విద్యతోపాటు అమ్మ ఒడి, ఆసరా, చేదోడు, చేయూత, విద్యాదీవెన, విద్యాకానుక, జగనన్న హౌస్‌సైట్స్, ఆరోగ్య సురక్ష ఇలా ఎన్నో పథకాలను అవినీతి, లంచాలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి అందించిన జగనన్నకు, అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు రానున్న ఎన్నికల్లో మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా రెల్లివీధిలో నివసిస్తున్న 150 మంది మహిళలకు స్టీల్ క్యాన్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుర కిరణ్, పువ్వులు కల్యాణ్, సాండి పోలి, కొప్పిలి షేక్, కె.పవన్, ఇందు, పె.రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే వాసుపల్లి సొంత నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ శ్రీకన్య థియేటర్ పక్కన గల ఇందిరా గాంధీ కాలనీలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తన సొంత నిధులతో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ప్రతీవారం నిర్వహించే ప్రజాదర్బార్‌లో వస్తున్న వినతుల పరిష్కారంలో భాగంగా ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీల పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ కాలనీలో నివసిస్తున్న పేదల కష్టాలు తెలిసిన నేతగా తన వంతు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి నేతృత్వంలో ఈ కాలనీ అభివృద్ధికి నాంది పడిందన్నారు. కాలనీ వాసుల కోరకుంటే ఇదే ప్రాంతంలో జీ ప్లస్ త్రీ తరహా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు లేదా ఇళ్ల పట్టాలు వేయించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డితో గానీ జీవీఎంసీ అధికారులతో గానీ తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వారంలోనే పూర్తి చేయించి నివాసులకు అసౌకర్యం కలుగకుండా చూస్తానని వాసుపల్లి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాసరావు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యులు షరీఫ్, స్టేట్ డైరెక్టర్ ఎస్.ప్రసాదరావు, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, కాలనీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా టైలర్స్ డే

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం సామాజిక భవనంలో గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచ టైలరింగ్ మిషన్ సృష్టికర్త ఐజక్ మెరిట్ సింగర్‌కు ఘన నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు సిహెచ్.యాదగిరిరెడ్డి మాట్లాడుతూ 27 ఏళ్లుగా టైలర్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. రడీమేడ్ రంగం విస్తరించడంతో టైలర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సంయుక్త కార్యదర్శి కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ 27 ఏళ్ల కిందట స్థాపించిన తమ సొసైటీ దినదినాభివృద్ధి చెంది సుమారు 150 షాపులకు చెందిన 1000 మంది సభ్యులను నేడు కలిగి ఉందని చెప్పారు. ముఖ్య అతిథి వీ డెంటల్ డైరెక్టర్ రమేష్ కె.ఎం.కె. మాట్లాడుతూ తాను కూడా ఒక దర్జీ కుటుంబానికి చెందిన వాడినని, ఇలా సొసైటీ సభ్యులను కలవడం సంతోషంగా ఉందన్నారు. తన వంతు సాయంగా పేద దర్జీ కుటుంబానికి రూ.5 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. టైలర్స్‌కు వీ డెంటల్‌లో ఉచిత కన్సల్టేషన్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ కార్యదర్శి సిహెచ్.వేణు, కోశాధికారి సిహెచ్.తిరుపతిరావు, సభ్యులు బి.ఐజక్, ఆర్కే, నరసింగరావు, మోహన్, అధిక సంఖ్యలో దర్జీలు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా నడక, వంటల పోటీలు



మహిళలు వండిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జీలు

**మద్రిపాలెం:** మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు వంటలు, నడక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 51వ వార్డు కళింగ నగర్ ఈస్ట్ పార్కులో నిర్వహించిన ఈ పోటీల్లో ఎక్కువ మంది మహిళలు పాల్గొని వారి నైపుణ్యాన్ని చాటుకున్నారు. రకరకాల పోషక పదార్థాలతో వంటలు తయారీ చేశారు. వయసుల వారీగా నడక పోటీల్లో పాల్గొన్నారు. 70 ఏళ్లు దాటిన జి.విజయలక్ష్మి, కామాక్షి, 61 ఏళ్లు నిండిన కె.నాగమణి, పి.వరలక్ష్మి, సత్యవతి, 45 నుంచి 60 ఏళ్ల లోపు ఎ.జమున, అఫ్సర్‌ఖాన్, జ్యోతి, 30 నుంచి 45 ఏళ్ల వయసు లోపు బి.లావణ్య, జ్యోత్స్న, దేవిలు విజేతలుగా నిలిచారు. వంటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మురళీనగర్ వర్మా కాంప్లెక్స్ దరి ఎస్ ఫంక్షన్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

## ఉన్నత శిఖరాలకు గుల్జార్

**సీతంపేట:** ఉర్దూ కవి, హిందీ సినీ దర్శకుడు 90 ఏళ్ల గుల్జార్‌కు జ్ఞానపీఠ్ అవార్డుతో హిందీ చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ స్థానం దక్కిందని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం జరిగిన అభినందన సభలో కేక్ కట్‌చేసి గుల్జార్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంకృషితో గుల్జార్ ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఆయన రాసిన పాటలు, మాటలు, దర్శకత్వం వహించిన చిత్రాలు ఆణిముత్యాలని కొనియాడారు. ఈ సందర్భంగా గుల్జార్ దర్శకత్వం వహించిన 1972లో విడుదలైన కోసిస్ హిందీ చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావురెడ్డి, గునేశ్వర బాబ్జీ, మధుబాబు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ‘గ్రీవెన్స్’



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

**సీతమ్మధార:** జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయన వద్ద విన్నవించుకుని వినతిపత్రాలు సమర్పించారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్ని అర్జీలను తక్షణం పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో అప్రెంటిస్ మేళా

**మద్రిపాలెం:** కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సెంట్రలైజ్డ్ అప్రెంటిస్ మేళాను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఈ మేళా ఏర్పాటు చేశామన్నారు. బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్ ట్రెనింగ్ సదరన్ రీజియన్(చెన్నై) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా సాంకేతిక విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, వికాస్ (స్వచ్ఛంద సంస్థ) ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు, ఆశా సొసైటీ అధ్యక్షుడు మస్తాన్‌వల్లి అతిథులుగా విచ్చేశారు. అప్రెంటిస్ శిక్షణ ప్రాముఖ్యాన్ని అతిథులు వివరించారు. 14 ప్రముఖ సంస్థల సిబ్బంది 175 మంది అప్రెంటిస్ ట్రెనింగ్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేశారు. మేళా విజయవంతానికి కేబీఎస్ఎస్ కుమార్, కళాశాల సిబ్బంది సహకరించారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రెనింగ్(బోట్) ఎస్ఆర్ చెన్నై అసిస్టెంట్ డైరెక్టర్ జి.ఎడ్వర్డ్ పాల్, హిందుస్థాన్ షిప్‌యార్డు మేనేజర్ డాక్టర్ సోమసుందరం, జీబీసీ శిక్షణ – ఉపాధి అధికారి సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

# అబ్బురపరిచిన ఆవిష్కరణలు



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రొఫెసర్ పార్వతీశం



సైన్స్ నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



హరగోపాల్ స్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**సీతంపేట:** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో సైన్స్ ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు ఆలోచింపజేశాయి. సైన్స్‌పై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయుల సహకారంతో పలు మోడల్స్ ప్రదర్శించారు. పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని డి.శాంతికుమారి, సైన్స్ ఉపాధ్యాయులు జి.రమామణి, వి.వి.అశోక వాణి, కె.శైలజ, ఎం.ఎ.భ్రమరాంబ పర్యవేక్షించారు.

**200 సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన**

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని హరగోపాల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ టి.శంకరరావు నాయుడు ఆధ్వర్యంలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్ సి.వి.రామన్ చిత్రపటానికి ముఖ్య అతిథులు విశాఖ జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, సెక్రటరీ ఎంవీవీ సత్యనారాయణలు పూలమాల వేసి నివాళులర్పించారు. సైన్స్ వ్యాప్తి కోసం ఆయన చేసిన కృషి విద్యార్థులకు వీరు వివరించారు. పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. చంద్రయాన్–4, ట్రాఫిక్ నియమాలు, సోలార్ విద్యుత్ తయారీ, కాలుష్యం నివారణ మార్గాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 200 సైన్స్ ప్రదర్శనలు ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రిన్సిపాల్ అందించారు.

**ఆకట్టుకున్న ప్రయోగాలు**

**కంచరపాలెం:** ఊర్వశి కూడలిలోని రైట్‌వే స్కూల్‌లో సైన్స్ డే సందర్భంగా వ్యకృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.సుదర్శన్ మాట్లాడుతూ గడిచిన దశాబ్దంగా సైన్స్ ప్రాధాన్యం బాగా పెరిగిందని, పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు తమలో దాగిన సృజనని వెలికితీసేలా ప్రయోగాలు చేపడుతున్నారన్నారు. సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

- 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, సిహెచ్ చంద్రశేఖర్, పెద్దాడ వెంకటేశ్వరరావు, బి.పరమేశ్వరరావు, అల్లం వెంకటరమణ, ఆదిశేషగిరి, గంట్యాడ ఆనంద్, శిరీష, ఉమాసత్యవేణి, సునీత, కనకరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

**చిన్నారుల వైజ్ఞానిక ప్రదర్శన**

**మద్రిపాలెం:** మాధవధారలోని శ్రీ అక్షర–శివాని స్కూల్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అబ్బురపరచింది. విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్–3, సోలార్ విద్యుత్ తయారీ, కాలుష్య నియంత్రణ పద్ధతులు, పౌష్టికాహార తయారీ విధానం, ట్రాఫిక్ నిబంధనలు, జామెట్రిక్ సిటీ, సిగ్నల్స్ వంటి ప్రాజెక్టులు ఆకర్షణీయంగా నిలిచాయి. విద్యార్థుల తల్లిదండ్రులు నమూనాలు చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.మందాకిని, ఉపాధ్యాయులు తరంగిణి, సునీత, జయలక్ష్మి, భవాని, టీచర్లు పాల్గొన్నారు.

- 51వ వార్డు మాధవధార ఆర్టీవో కార్యాలయం వద్ద గల శ్రీపాద డిగ్రీ కాలేజీలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను విశిష్ట అతిథి డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ బి.పార్వతీశం తిలకించారు. విద్యార్థులకు తగు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# అవగాహనతోనే క్యాన్సర్‌కు చెక్



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయకుమారి

**మద్రిపాలెం:** అవగాహనతోనే క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చని డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ విశాఖ వ్యాలీ ఆధ్వర్యంలో మద్రిపాలెం ఎఫ్‌సీఐ పార్కులో బుధవారం క్యాన్సర్‌పై నారీ ఇన్ పింక్ సారీ పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి, జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షురాలు ఇంద్రజ శంకు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, జీవన శైలి కారణంగా ప్రతి 50 మందికి ఒకరిలో క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. మహిళల్లో స్వీయ పరీక్ష ద్వారా క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి తగిన చికిత్స ద్వారా నివారించవచ్చని తెలిపారు. సుమారు 80 మందికి పైగా మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేసీఐ లేడీ జోన్ ఆఫీసర్ జ్యోతిరాణి, భవ్య, స్వర్ణ, లత తదితరులు పాల్గొన్నారు.

# తప్పిన ప్రమాదం

**మద్రిపాలెం:** మాధవధార మెయిన్ రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. 51వ వార్డు మాధవధార వుడా కాలనీ వద్ద మెయిన్ రోడ్డులో మాధవధార–2 11కేవీ ఫీడర్‌ను లోడ్ ఉన్న కంటైనర్ లారీ వెనుకకు తీస్తున్న సమయంలో క్లీనర్ లేకపోవడంతో బలంగా ఢీకొంది. దీంతో విద్యుత్ పోల్ రోడ్డు మీదకు పడిపోయింది. వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో అధికారులు వచ్చి సమీక్షించి సరఫరాను పునరుద్ధరించారు. ఈ రోడ్డులో అదృష్టవశాత్తు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

# కథలు మానవతా విలువలు పెంచాలి



మాట్లాడుతున్న ద్విభాష్యం రాజేశ్వరరావు

**సీతంపేట:** సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కథా కచేరిలో ప్రముఖ రచయితలు చదివిన కథలు అందరినీ అలరించాయి. ముఖ్య అతిథి, కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ కథానిక మానవతా విలువలను పెంచేదిగా ఉండాలన్నారు. వ్యక్తులకు సభ్యతా, సంస్కారం నేర్పేటట్టు ఉండాలని సూచించారు. సత్యాన్ని నిలబెట్టడం, ధర్మాన్ని ఆచరించమని కేవలం వాక్యంగా చెప్పడం కాకుండా కథలోని పాత్రలు, నడత ద్వారా ప్రతిబింబింపచేయాలన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలు మానసిక ఉల్లాసంతోపాటు నైతికత పెంపొందించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణ, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.జి.వేణు పాల్గొన్నారు.

# ఐదుగురు గంజాయి నిందితులకు రిమాండ్

**మద్రిపాలెం:** కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి గంజాయి ముఠాను పట్టుకున్న పోలీసులు బుధవారం వారిని రిమాండ్‌కు తరలించారు. వారి వివరాలిలా.. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా రెడ్డి కంచరపాలెంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వెస్ట్ బెంగాల్ ముర్షిదాబాద్‌కు చెందిన ముగ్గురు పురుషులు షేక్ అల్లావుద్దీన్, షఫీక్‌షేక్, నషీరుద్దీన్ మండల్, ఇద్దరు మహిళలు షేక్ భకీరున్, రూబీలను అదుపులోకి తీసుకుని విచారించారు. అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్టు విచారణలో తేలింది. వీరంతా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గంజాయిని అక్రమ రవాణా చేసి ఇక్కడ విక్రయించే క్రమంలో వారిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఎస్.భాస్కర్‌రావు నేతృత్వంలో నిందుతులను రిమాండ్‌కు తరలించారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**తాటిచెట్లపాలెం:** అక్కయ్యపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో నూతన 132 కేవీ హెచ్‌టీ టవర్ నిర్మాణం, కండక్టర్ మార్పులు చేపడుతున్నందున గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్ జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏఎస్సార్ నగర్, వైఎస్సార్ నగర్, చిట్టిబాబు కాలనీ, ఏపీ టిడ్కో భవనాలు, సంతోషిమాత కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

# కొలిక్కి రాని చోరీ కేసు

**సీతమ్మధార:** దొండపర్తి ప్రాంతం బాలాజీ మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నంబర్ 102లో జరిగిన చోరీ కేసు కొలిక్కి రావడం లేదు. 6 రోజుల కిందట ఇక్కడ చోరీ జరగ్గా.. 150 తులాల బంగారు ఆభరణాలు పోయాయని బాధితుడు, విశ్రాంత పోస్టల్ అధికారి జనపాల ప్రసాద్‌బాబు చెబుతున్నారు. అయితే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మాత్రం 74 తులాలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ ప్రారంభించిన డీసీపీ క్రైం వెంకటరత్నం ఆధ్వర్యంలో ఏడీసీపీ గంగాధర్ పలుమార్లు ఇంటి యజమాని, ఇంట్లో పనిచేస్తున్న వారు, బాధితుడు అనుమానం వ్యక్తం చేసిన 11 మందిని విచారించారు. దర్యాప్తులో ఎటువంటి ఆధారాలు పోలీసులకు లభ్యం కాలేదు. సీసీ ఫుటేజ్‌ల్లో ఆ 11 మంది ఇంటికి వచ్చి వెళ్లినట్లు కనిపిస్తోంది తప్పితే.. వారి చేతిలో ఎటువంటి బ్యాగులు లేవు. ఇంట్లో అందరూ ఉన్నప్పుడే బంగారు నగలు పోవడంతో.. ఇంట్లో వారినే పోలీసులు అనుమానించే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రసాద్ భార్య, కుమార్తెను పలుమార్లు విచారించారు. అయినప్పటికీ ఎటువంటి క్లారిటీ రాలేదు.

## క్లుప్తంగా

### పార్వతీశ్వరుల కల్యాణోత్సవాలు ప్రారంభం



ఉత్సవమూర్తులకు మంగళస్నానం

**సీతంపేట:** సీతంపేటలో కొలువైన పార్వతీశ్వరస్వామి 34వ వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో రమాభాయి పర్యవేక్షణలో శైవగమ పండితుడు అయిలూరి శ్రీనివాస దీక్షితులు, ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ నేతృత్వంలో పార్వతీశ్వరుల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా మంగస్నానం జరిపించారు. అర్చకులు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అంకురార్పన, ధ్వజారోహణ సాయంత్రం 6 గంటలకు అంగరంగ వైభవంగా స్వామి వారి కల్యాణం జరుగుతుందని తెలిపారు. మార్చి 1న సాయంత్రం 6 గంటలకు మేళతాళాలతో సారె ఊరేగింపు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

### 6న వార్షిక కల్యాణం

**సీతమ్మధార:** జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మార్చి 6న వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు రామారావు శర్మ, ఈవో శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు రూ.300 చెల్లించి రసీదు పొందాలని కోరారు.

**మహాశివరాత్రికి ఏర్పాట్లు**

మార్చి 8వ తేదీ శుక్రవారం ఉదయం 4.30 గంటల నుంచి దర్శనాలు, ఏకవార అభిషేకాలు జరిపిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి లింగోద్భవకాల సమయంలో అభిషేకానికి భక్తులు రూ.100 చెల్లించి రసీదు పొందాలని కోరారు.

### 2న పుస్తకావిష్కరణ

**సీతంపేట:** ప్రొఫెసర్ కె.ఎస్.చలం రచించిన ‘బౌద్ధ విజ్ఞానం, లౌకిక జీవనం’ పుస్తకావిష్కరణ సభ మార్చి 2వ తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరుగుతుందని అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మయన్మార్(బర్మా)కు చెందిన భిక్షు రాజధమ్మ ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. ఏయూ ఫిలాసఫీ విభాగాధిపతి వి.వెంకటరావు అధ్యక్షతన జరిగే సభలో కవులు, కళాకారులు, సాహిత్యాభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### విద్యపై అవగాహన



పిల్లలకు పలకలు అందిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

**సీతంపేట:** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి స్పెషల్ క్యాంప్స్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం కళాశాల సమీపంలోని రేసపువానిపాలెంలో పిల్లలకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్య ఆవశ్యకత, విద్యతో కలిగే ఉన్నతిపై పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.శివజ్యోతి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలో 137 మంది ఎంపిక

**కంచరపాలెం:** స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) శాంతి(టెక్నికల్) తెలిపారు. సుమారు 10 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 620 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 380 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 137 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు.